


# మబ్బులు తొలగిన ఆకాశం

డా.సి.ఎం.అనూరాధ

గబగబా ఆఖరిపేజీ టైప్ చేస్తూ టైమ్ చూసుకున్నాను. ఏడు గంటలవుతోంది. ఈరోజు చాలా లేట్ అయిపోయింది. పాప ఏం చేస్తోందో? ఈమధ్య ఆఫీస్‌లో ఇది రొటీన్ అయిపోయింది. ప్రతిరోజు ఏదో ఒక కంపెనీవాళ్ళు రావడం, ఎవరో ఒకరి మీటింగ్స్, అవీ ఇవీ అంటూ దాదాపు ప్రతిరోజూ లేట్ అవుతోంది. అయితే ఏ టైం అయినా బస్సుల కోసం ప్రాకులాడే పని లేదు. ఆఫీస్ వ్యాన్‌లోనే అందరినీ డ్రాప్ చేస్తారు. అయినా అత్తయ్యగారు ఉన్నారు కనుక నాకేం భయం లేదు పాప గురించిన ఆందోళన లేదు.

మా ఫ్రెండ్స్ అందరిలో నేనే అదృష్టవంతురాలి క్రింద లెక్క. ఎందుకంటే మా అత్తయ్యతో నాకెటువంటి ప్రాబ్లం లేదు. పైగా ఎంతో సాయంగా ఉంటారు. విమల అయితే ప్రతిరోజూ ఏడుస్తుంది. వాళ్ళ అత్తగారు చాలా గయ్యాళిట. విమల పాపం ఉదయం నాలుగు గంటలకే లేచి వంటలు పూర్తి చేసి, పిల్లల్ని భర్తని చూసుకుని క్యారియర్స్ తయారుచేసి పంపించి తను ఆఫీస్‌కు రావాలి. వాళ్ళత్తగారు అటు పుల్ల కూడా ఇటు పెట్టరట. పైగా ప్రతిదానికి సాధిస్తుంటారట. రకరకాల కూరలు ఉండాలని ఆంక్షలు. విమల భర్త ఆమెను ఏమీ అనలేక విమలపై అరుస్తారట. కూర కాస్త రుచి తగ్గినా ఆమె విరుచుకుపడి అరుస్తుందట. పోనీ జాబ్ మానేద్దామనుకుంటే అలా కూడా అంగీకరించరట. అయినా జాబ్ కూడా లేకపోతే తను రోజంతా ఇంట్లో ఆమె పెట్టే చిత్రహింసలను తట్టుకోవడం చాలా కష్టమంటుంది విమల. ఆఫీస్‌కు రావడం వల్ల రోజుకు కనీసం కొన్ని గంటలు ఆమె బారినుంచి తప్పించుకున్నట్లు ఉంటుంది అంటుంది. విమల వెళ్ళేవరకు పిల్లలకు కనీసం పాలు కూడా కలిపి ఇవ్వదట. అందుకే లేట్ అయిందంటే చాలు విమల మనసంతా పిల్లల మీదే వుంటుంది. ఇద్దరూ చిన్న పిల్లలు. ఆకలికి అలమటిస్తుంటారని ఏడుస్తూ వుంటుంది.

ప్రమద వాళ్ళత్తగారు అంతే అయితే ఈవిడ కొద్దిగా బెటర్. ప్రమదను తిట్టి పోయడం చేయదట. అయితే ఏ పనీ ముట్టుకోదు. పిల్లల్ని కూడా అస్సలు చూసుకోదట. ప్రమద కూడా ఆఫీసులో కాస్త లేటయిందంటే ఎంతో టెన్షన్ పడుతూ ఉంటుంది పిల్లల మీద.

మరికొంతమంది ఫ్రెండ్స్ అయితే ఇంట్లో చూసుకునే వారెవరూ లేక పిల్లల్ని క్రష్‌లో వదిలి వస్తారు. వాళ్ళు చెప్పిన టైమ్‌కు వెళ్ళలేకపోతే ఎంతో ఆందోళన పడుతుంటారు పిల్లల గురించి.

చిన్నపిల్లల్ని కేర్ సెంటర్‌లో వదలడం, అక్కడ ఎలా ఉన్నారో, వాళ్ళు బాగా చూస్తున్నారో లేదోనని ప్రతి నిముషం ఆందోళన చెందడం, ఇలా ఎప్పుడైనా ఆఫీస్‌లో లేటయినపుడు పిల్లలని కాస్త చూసుకోమని పక్కింటి వారిని అభ్యర్థించడం ఇవేవీ నాకు అనుభవంలోకి రాలేదు. ఇందుకు ముఖ్యకారణం మా అత్తయ్యగారు. కలిసి ఉంటే కలదు సుఖం అన్న నానుడి నాకెంతో ఇష్టం. అయితే అందరికీ మా అత్తయ్యగారి లాంటి పెద్దదిక్కు వున్నప్పుడే ఇది సాధ్యం అవుతుంది. గయ్యాళి అత్తలయితే కలసి ఉంటే సుఖం బదులు అంతులేని దుఃఖం వుంటుంది.

పాప అంత ఆరోగ్యంగా ఉండానికి ముఖ్య కారణం ఆవిడే. నేను ఉదయమే లేచి వంట పూర్తి చేస్తాను. ఆమె ఎన్నోసార్లు నన్ను వారిస్తారు. "ఇంటి పనంతా చేసుకుని మళ్ళీ నీవు ఆఫీస్‌లో కష్టపడాలి కదమ్మా! వంట నేను చేస్తానులే. నీవు ఇంకాస్సేపు నిద్రపో అని. అంత మాత్రం కన్సర్న్ చాలు కదా మనిషికీ, మనిషికీ మధ్య బంధం గాఢం కావడానికి. నేను ఆమెను సున్నితంగానే వారించి పనంతా చేసుకుంటాను. జీవితంలో ఇంత వరకూ కష్టపడి ఉంటారు. ఇప్పుడు అదే పనే అయితే ఆమెకు విశ్రాంతి ఎప్పుడు? అందువల్ల నేను పనంతా పూర్తి చేసుకొని పాపకు స్నానం చేయించి ఆఫీస్‌కు వెళతాను. ఇక పాపను, పౌడర్, బొట్టు వేసి తీర్చిదిద్దడం, తినిపించడం ఆమె డ్యూటీలు. ఆ రెండు పనులూ మా అత్తయ్యగారికి అత్యంత ఇష్టమైనవి. పాపకు చక్కగా పౌడర్ వేసి, రోజుకో రంగు తిలకం దిద్ది, రోజుకో రకంగా జుట్టు దువ్వి తనకు నచ్చినట్లు మేకప్ చేస్తుంటారు. ఇక భోజనం విషయానికొస్తే వారిద్దరూ ఒకే ప్లేట్‌లో తింటారు. పాపకు ఆమె బాగా మచ్చిక. బామ్మ ప్లేట్‌లో చేయి పెట్టి చిన్ని ఇన్ని ముద్దలు తీసుకొని తింటుంది. సెపరేట్‌గా పెడితే తినదు. బామ్మ దగ్గరే నిద్ర పోతుంది.

నేను ఆలోచనల్లో వుండగానే ఇల్లు వచ్చేసింది. నేను ఎక్స్‌పెక్ట్ చేసినట్లే పాప హాయిగా వాళ్ళ బామ్మతో ఆడుకుంటూ వుంది. ఆ దృశ్యం చూడడం నాకెంతో ఇష్టం. ఎక్కడైనా బయటికెళ్ళినప్పుడు పాప వాళ్ళ బామ్మ చేయి పట్టుకుని తనే నడిపిస్తుంది. ఆ దృశ్యాలు కూడా నాకెంతో ఇష్టం. పెద్దవాళ్ళను మనం జాగ్రత్తగా చూసుకోవాలి. పెద్దవాళ్ళు, పిల్లలు ఒకరి అభిప్రాయాలను ఒకరు గౌరవించి, కలిసిపోయి ఓపెన్‌గా మనసు విప్పి మాట్లాడుకున్నప్పుడే కదా కుటుంబంలో ఆనందం వెల్లివిరిసేది. అందుకే మా చిన్ని ఇల్లు భువిపైన ఉన్న స్వర్గం లాంటి 'హ్యాపీ హోమ్'.

"లేటయిందేమ్మా! వెళ్ళి కాస్త ముఖం కడుక్కుని ఫ్రెషప్ అవ్వు. నేను వేడిగా కాఫీ ఇస్తాను" అంటూ అత్తయ్యగారు కిచెన్‌లోకి వెళ్ళబోయారు.

"ఫరవాలేదండీ! నేను పెట్టుకుంటాను. మీక్కూడా ఓ కప్ తీసుకురానా" నేను తనని వారించాను. ఆమె ఎప్పుడూ అంతే. తాను అత్తగారినని అజమాయిషీ చేయడం అలవాటు లేదు. ఎటువంటి భేషజాలు లేని నిర్మల హృదయురాలు. నేనెంతో మంది అత్తగార్లని చూశాను. కోడలు అనగానే వేరే దృష్టితో చూస్తారు. వాళ్ళకి చనువు ఇవ్వకూడదని, వాళ్ళపైన అజమాయిషీ చేయాలని అనుకుంటారు. మా అత్తగారికి అటువంటివేవీ తెలియదు. తెలియని వాళ్ళు చాలామంది ఆమెను మా అమ్మ అనుకుంటారు. నేను కూడా మా అమ్మ దగ్గర ఉన్నంత చనువుగానూ, ఆమెతో ఉంటాను. తన అభిప్రాయాలను గౌరవిస్తాను. ఆమె చెప్పినట్లే నడుచుకుంటాను. మా వారితో ఏదైనా గొడవ పడినా ఆవిడతోనే చెప్పుకుంటాను. ఆమె ఓదార్పు నాకు ఎంతో బలాన్నిస్తుంది. ఎన్ని కౌన్సిలింగ్ సెంటర్లు ఉన్నా పెద్దవారి ఓదార్పు ముందు దిగదుడుపే కదా!

కాఫీ కలిపి అత్తయ్యగారికి ఓ కప్పు నాకొక కప్పు తీసుకుని వచ్చి అక్కడే కూర్చున్నాను. అత్తగారు పాప చేసిన ముద్దు మురిపాలన్నీ నాకు వివరించి వివరించి యాక్షన్‌తో సహా చూపిస్తున్నారు. నేను రావడం లేట్ అయ్యేసరికి పాప అందట "బామ్మా! అమ్మ ఇంకా రాలేదు కదా! వాళ్ళఫీస్ దగ్గర పెద్ద వర్షం వచ్చి బస్సులన్నీ కొట్టుకుపోయాయా?" అని అత్తయ్యగారు కాస్త బాధపడి అన్నారట "అలా అనకు చిన్నీ! పైన తథాస్తు దేవతలుంటారు" అని పాప. "ఆ దేవతలు ఎక్కడుంటారు? ఏం చేస్తారు" అని అన్నీ అడిగి తెలుసుకుందట. ఓ అరగంట ఆగాక గట్టిగా ఆకాశం వైపు చూస్తూ అరుస్తూ ఉందట. 'నాకు కారు కావాలి, టెన్ టెడ్డీబేర్స్



కావాలి, ఇన్ని బార్బీ బొమ్మలు కావాలి. ప్రిన్సెస్ బార్బీ కూడా కావాలి' అని. ఎందుకలా అరుస్తున్నావ్ చిన్నీ! అని అడిగారట అత్తయ్య. పాప 'ఇందాక చెప్పావుగా బామ్మా! మనం అనుకున్నవన్నీ ఆకాశంలోని తదాస్తు దేవతలు విని అలాగే అని అంటారని. అందుకే అన్నీ కోరుకుంటున్నాను. ఆ దేవతలు నాకిప్పుడు కారు, టెడ్డీబేర్స్, బొమ్మలు అన్నీ ఇస్తారు' అని చెప్పిందట. విషయమంతా విని నేను కూడా ఆమెతో పాటు నవ్వసాగాను.

మేమంతా అలా నవ్వుకుంటుండగా మా వారు వచ్చారు. "ఏంటీ! అత్తాకోడళ్ళిద్దరూ నా కూతురు గురించేనా అంతగా నవ్వుకుంటున్నారు" అంటూ "అవునూ! ఇవాళ చిన్నీ ఏం చేసిందో తెలుసా" అంటూ తిరిగి అది మాట్లాడిన మాటలన్నీ కొడుకు ముందు ఏకరువు పెట్టారు. ఈసారి ఆయనా మా నవ్వులో శృతి కలిపారు.

నేను, అత్తయ్యగారు కలిసి రాత్రి వంట పూర్తి చేశాము. చపాతీలు నేను వత్తుతుంటే తను కాల్చిపెట్టారు. అందరం భోంచేసి పడుకున్నాం. ఎందుకో అర్థరాత్రి మెలకువ వచ్చింది. చూస్తే అత్తయ్యగారు దగ్గుతున్నారు. గబగబా లేచి మంచి నీళ్ళు అందించాను. "ఎందుకమ్మా నీవు లేచావు? నేను తీసుకొని త్రాగేదాన్నిగా" అంటూ మొహమాటపడ్డారు. తిరిగి నా రూమ్‌లోకెళ్ళిపడుకుంటూ అనుకున్నాను. ఈమధ్య అప్పుడప్పుడు దగ్గుతున్నారు. ఓసారి డాక్టర్ దగ్గరికైనా తీసుకెళ్ళి చూపించాలని మొన్ననే అడిగాను వెళ్దామని. కానీ తను ఒప్పుకోలేదు. ఈ దగ్గుకి డాక్టర్ దగ్గరికా, వాళ్ళు రకరకాల మందులు రాసిస్తారు అనవసరంగా, రెండు మిరియాలు తింటే అదే తగ్గిపోతుంది అంటూ. తనకు డాక్టర్లన్నా, జబ్బులన్నా చాలా భయం. మావారు కూడా అంతే వాళ్ళమ్మలాగా డాక్టర్స్, మెడిసిన్స్ అంటే భయపడతారు. అందుకే ఇంట్లో ఎవరికి అవసరమైనా డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళడం నా డ్యూటీనే.

మరుసటిరోజు ఆఫీస్ నుంచి రాగానే అత్తయ్యగారిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాను. డాక్టర్ పరీక్షించి అన్ని వివరాలు అడిగి ఎక్స్‌రే తీయించమన్నారు. అది చేయించి పాపను అత్తయ్యనూ ఇంటి దగ్గర వదిలి రిపోర్ట్స్ కోసం నేను తిరిగి డాక్టర్ దగ్గరకు చూపించగానే ఆయన చెప్పిన విషయం విని నా తల తిరిగినట్లయింది. అత్తయ్యగారికి టి.బి. అని చెప్పారు. నేను ఏడుపు ఆపుకోలేకపోయాను. అసలే తనకు జబ్బులంటే భయం. ఈ విషయం తెలిస్తే ఏమైనా ఉందా?

డాక్టర్‌గారు నాకు ధైర్యం చెప్పారు. "ఏం ఫరవాలేదమ్మా. ఈరోజుల్లో టి.బి.కి అంతగా భయపడవలసిందేమీ లేదు. మంచి ఫుడ్ తీసుకుంటూ మెడిసిన్స్ రెగ్యులర్‌గా వాడితే ఈజీగా క్యూర్ అయిపోతుంది. అయితే ఒక ముఖ్యమైన విషయం పాపను తనకు కాస్త దూరంగా వుంచండి. ఇన్ఫెక్షన్ సోకే ప్రమాదముంది.

ఈ జాగ్రత్తలు పాటిస్తూ మెడిసిన్స్ రెగ్యులర్‌గా వాడితే ఏం భయం లేదు. ఓ పదిహేను రోజులు ఈ మందులు వాడి ఓసారి రండి" అంటూ ప్రిస్క్రిప్షన్ రాసిచ్చారు. మందులు ఫ్రూట్స్ అన్నీ తీసుకుని దిగులుగా ఇంటికొచ్చాను. నేనొచ్చేసరికి మావారు కూడా ఇంట్లోనే వున్నారు. ఆయన రిపోర్టులో ఏముందని అడిగారు. ఏం లేదు అంతా బావుందని చెప్పారు. బలానికి టానిక్స్ టాబ్లెట్స్ ఇచ్చారు అని చెప్పాను. అత్తయ్యగారికి టాబ్లెట్స్ అందించాను.

నాలో నేనే మథనపడి, మథనపడి రాత్రంతా నిద్రలేకుండా జాగరణ చేశాను. ఫలితంగా ఉదయం లేవలేకపోయాను. అత్తయ్య వచ్చి నా నుదురు పట్టుకుని చూసి మెల్లగా పిలిచారు "అంజలీ! ఇవాళ ఆఫీస్‌కు వెళ్ళవా? ఒంట్లో నలతగా వుందా?" అంటూ. "అవునత్తయ్యా! ఇంకాసేపు పడుకుంటాను" అని ఓ పది నిముషాలు పడుకుని లేచి గబగబా అత్తయ్య సహాయంతో వంట పూర్తి చేసి, పాపకు స్నానం చేయించి ఆఫీస్‌కెళ్ళాను.

ఆఫీస్‌కు వెళ్ళానన్నమాటే గానీ పనిమీద దృష్టి కుదరవడం లేదు. కొలీగ్స్ అడిగారు "ఏంటీ అంజూ! డల్‌గా వున్నావ్" అని ఏమీ సమాధానం చెప్పలేకపోయాను.

ఇలా నాలుగు రోజులు గడిచాయి. నా ఆలోచనలు ఓ కొలిక్కిరాలేదు.

లంచ్ అవర్లో అన్నం కెలుకుతూ ఆలోచిస్తున్న నన్ను విమల గమనించింది. "ప్రాబ్లం ఏంటో నాకైనా చెప్పు అంజూ" అడిగింది. ఇక ఆపుకోలేకపోయాను. నాలుగురోజుల నుంచి నా గుండెలోనే నిప్పులా దాచుకున్న నిజాన్ని తనకు తెలియచెప్పాను.

"అరెరే! ఏంటి అంజలీ! ఇంత చిన్న విషయానికి ఇంతగా ఆలోచించాలా? నేనో సలహా ఇవ్వనా! మీ అత్తయ్యగారికి డాక్టర్ చెప్పిన విషయం చెప్పకు. అది విని తను కోలుకోలేకపోతే కష్టం. పాపను మాత్రం మీ అమ్మావాళ్ళు చూడాలంటున్నారని చెప్పి కొన్ని రోజులు మీ అమ్మ దగ్గర వుంచు. నెమ్మదిగా పాప అక్కడ అలవాటైపోతుంది. మీ అత్తయ్యగారు కూడా అంతలో కోలుకుంటారు. తర్వాత పాపను తీసుకురావచ్చు" విమల చెప్పిన సలహా నాకు బాగానే ఉందనిపించింది.

వెంటనే అమ్మకు ఫోన్ చేశాను. విషయమంతా వివరంగా చెప్పాను. వచ్చి పాపను తీసుకెళ్ళు అని రిక్వెస్టు చేసుకున్నాను. అమ్మ మర్నాడే బయలుదేరి వచ్చింది. పాప మొదట బామ్మను వదిలి అమ్మ దగ్గరకు పోనేలేదు. తర్వాత మెల్ల మెల్లగా వెళ్ళి ఆడుకోసాగింది. అమ్మ "పాపను ఓ నాలుగు రోజులు తర్వాత పంపిస్తానని చెప్పి తీసుకెళ్ళింది. మా వారు అడిగితే "అత్తయ్యగారికి కాస్త రెస్ట్ అవసరమని పంపించానని" చెప్పాను. వెళ్ళేప్పుడు పాప బిక్కమొహం వేసుకుని వెళ్ళింది.

పాప వెళ్ళి వారం రోజులయింది. అమ్మ ఫోన్ చేసింది. "పాప వాళ్ళ బామ్మ కోసం ఒకటే ఏడుపు. సర్దుకుంటుందిలే అని నీకు చెప్పలేదు. ఎలాగో ఈ వారం చూశాను. ఇక లాభం లేదమ్మా! ఈరోజు బాగా జ్వరం తెచ్చుకుంది. బామ్మా, బామ్మా అని ఒకటే కలవరింతలు. నీవు వెంటనే వచ్చి పాపను తీసుకెళ్ళు" అంటూ.

ఇక్కడ అత్తయ్యగారి పరిస్థితీ అలానే వుంది. పాప వెళ్ళినప్పటి నుంచీ తను సరిగా తిండి తినడం లేదు. నిద్ర పోవడం లేదు. రోజు రోజుకూ ఆమె కూడా పాప మీద బెంగపెట్టుకున్నారు. తను దిగులుగా ఉండడం చూసి నేనూ నాలుగు రోజులుగా ఆఫీస్‌కి లీవ్ పెట్టి ఇంట్లోనే గడుపుతున్నాను.

ఇక విషయం దాచడం అసాధ్యమని తెలిసి మా వారితో ఉన్న విషయం క్లియర్‌గా చెప్పాను. ఇద్దరం డిస్కస్ చేసి చివరకు అత్తయ్యగారిని డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి కౌన్సిలింగ్ చేయించి మెల్లగా అసలు విషయం చెప్పించాం. మొదట ఆమె చాలా భయపడ్డారు. కానీ నెమ్మదిగా విషయం అర్థం చేసుకున్నారు.

"అంజలీ! ఈ విషయం నాకు ముందే చెప్పి ఉండవలసిందమ్మా! అనవసరంగా నీవు నలిగిపోయావు. ఇప్పుడైనా మించిపోయింది లేదు. వెంటనే వెళ్ళి పాపను తీసుకురా! నేను తనకు మెల్లగా నచ్చచెప్పి దూరంగా వుండేలా చూసుకుంటాను. నేను దానికిది అంటకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటాను సరేనా" అంటూ ధైర్యం చెప్పి నన్ను పంపించారు.

మరుసటి రోజు పాపను తీసుకురాగానే బామ్మ, మనవరాలు ఇద్దరూ సంతోషంతో కౌగలించుకున్నారు. అది చూసి నా మనసెంతో తేలికయింది. మబ్బులు తొలగిన ఆకాశంలా.

ఇప్పుడు మా ఇల్లు మళ్ళీ కళకళలాడుతోంది. ఆఫీస్ నుంచి నేనింటికొచ్చేసరికి అవే నయనానందరకమైన దృశ్యాలు కనిపిస్తుంటాయి. మా పాప, అత్తయ్యగారు ఆడుకుంటూ నవ్వుకుంటూ కనిపిస్తారు. ప్రేమ పాశం అంతటి బలమైంది మరి. ఏ శక్తీవాళ్ళను విడదీయలేదు.



## దటీజ్ తమన్నా!

హిందీలో చాలా కామన్ అయిపోతున్న ముద్దుసీన్లు సౌత్‌లో మాత్రం ఇంకా జోరందుకోలేదు. అయితే ముంబాయి భామలు సైతం తెలుగు, తమిళ సినిమాల్లో ముద్దు సీన్లు చేయడానికి అంత సుముఖంగా లేరని తాజాగా తెలుస్తోంది. 'జబ్ వుయ్ మెట్' తమిళ రీమేక్‌లో ముద్దు సీన్ చేయనని ముందుగానే మొహమాటం లేకుండా చెప్పేసిందిట తమన్నా. హిందీలో కరీనా-షాహిద్‌ల మధ్య వున్న కిస్సింగ్ సీన్‌ని రీమేక్‌లో తీస్తామంటే కుదరదు నిర్మొహమాటంగా చెప్పేసరికి ఆ సీన్‌తో 'క్యాష్' చేసుకోవాలనుకున్న నిర్మాతలు బిక్కమొహం వేయాల్సి వచ్చిందిట.